వికారాబాద్ కలెక్టరేట్‌లో రంగోళి

వికారాబాద్, నవంబర్ 26 : స్వీప్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం మెప్మా, గురుకుల పాఠశాలల విద్యార్థినులు, సెర్ప్ మహిళా సంఘాల సభ్యులతో రంగోళి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భా గంగా మహిళలు వేసిన ముగ్గులను కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించి వారిని అభినందించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, స్వీప్ నోడల్ అధికారి సత్తార్, డీఆర్‌డీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రవికుమార్, డీఈవో రేణుకాదేవి, డీపీవో జయసుధ, డీఎస్‌డీవో మల్లేశం, ఆర్డీవో వాసుచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ

వికారాబాద్, నవంబర్ 26 : సాధారణ బదిలీల్లో భాగంగా వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి మంగళవారం బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని వెస్ట్‌జోన్‌లో అదనపు డీసీపీగా పని చేసిన హనుమంతరావు వికారాబాద్ అదనపు ఎస్పీగా బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ నుంచి మంత్రులు, కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇతర అధికారులు

వికారాబాద్, నవంబర్ 26 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని..రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఢిల్లీ నుంచి రాష్ట్రంలోని మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతుల నుంచి కొన్న ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి వారి బ్యాంకు ఖాతాల్లో త్వరగా డబ్బులు జమ అయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సన్న రకానికి బోనస్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగం చేయాలన్నారు. ప్రతి రోజూ కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం వస్తుంది.. ఇంకా ఎంత రావాల్సి ఉన్నదో నివేదికలను అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని, ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రవాణా చేసేలా తగినన్నీ లారీలను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 30న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న రైతుల పండుగను సక్సెస్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారు లు విజయలక్ష్మి, మోహన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

బండవెల్కిచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్

భోజనం నాణ్యతగా ఉండాలి

వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్

కులకచర్ల, నవంబర్ 26 : మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని.. విద్యా ర్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం అందించాలని వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో క్యాటిల్‌షెడ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలోని నర్సరీ, ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



నాగారం : కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ధారూరు మండలం, నాగారంలోని కొనుగోలు కేంద్రం పరిశీలన

ధారూరు, నవంబర్ 26 : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని నాగారం గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన వడ్ల గురించి కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులను పలకరించి కేంద్రం లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు వసతులు కల్పించాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి.. లారీల్లో లోడ్ చేసి రైస్ మిల్లులకు పంపించాలని.. మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ త్వరగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

యువత ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలి

కొడంగల్ : ఓటు హక్కు పొందడం మనందరి బాధ్యత అని.. 18 ఏండ్లు పైబడిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం ఓటర జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. ఈ రన్ అంగడిబజార్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ కూడలి వరకు కొనసాగింది. ఇందులో విద్యార్థులతోపాటు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు పొందడంపై అవగాహనలో భాగంగా 2కే రన్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంఈవో రాంరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి పనులు భేష్

- సర్దార్‌నగర్ గ్రామాన్ని సందర్శించిన ఢిల్లీ అధికారుల బృందం
- పనులు బాగున్నాయని కితాబు

సర్దార్‌నగర్‌లోని వైకుంఠధామాన్ని సందర్శించిన ఢిల్లీ అధికారుల బృందం

షాబాద్, నవంబర్ 26 : సర్దార్‌నగర్‌లో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనులు చాలా బాగున్నాయని ఢిల్లీ అధికారుల బృందం కితాబిచ్చింది. అడ్వాన్స్ ప్రొఫెషనల్ ప్రోగ్రాం ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్టడీ ఇన్ రూరల్ ఏరియాలో భాగంగా ఢిల్లీ నుంచి 12 మంది సీనియర్ అధికారుల బృందం మంగళవారం మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భం గా ఊరిలో పల్లెప్రగతి ద్వారా చేపట్టిన పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, కంపోస్ట్‌యార్డు, తెలంగాణ క్రీడాప్రాంగణం, హరితహారం నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ తదితర వాటిని పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే అతి పెద్ద సంతగా పేరుగాంచిన సర్దార్‌నగర్ పశువుల సంతను పరిశీలించారు. గ్రామంలో జరిగిన కార్యక్రమాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బృం దం సభ్యులు మాట్లాడుతూ...గ్రామంలో పల్లెప్రగతి ద్వారా చేపట్టిన పనులు ఎంతో బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరా జ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, షాబాద్ ఎంపీడీవో అపర్ణ, డీఎల్‌పీవో సతీశ్, ఎంపీవో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింహులు, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ అనిత, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులకచర్ల : అనంతసాగర్ అడవిలో వేసిన బోరు

అటవీ భూముల్లో బోర్లు వేస్తే చర్యలు

కులకచర్ల, నవంబర్ 26 : అటవీ భూముల్లో బోర్లు వేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ సెక్షన్ అధికారి సాయికుమార్ తెలిపారు. మండలంలోని అనంతసాగర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా బోరు వేసిన అనంతసాగర్ గ్రామానికి చెందిన చిల్ల రామకృష్ణ, సున్నల దస్తయ్యలకు ఒక్కొక్కరికీ రూ. 25 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

పరిగిలో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

చట్టాన్ని గౌరవిద్దాం.. ప్రాథమిక హక్కులను పొందుదాం

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ అధికారులు

వికారాబాద్, నవంబర్ 26 : బాధ్యత గల భారత పౌరులుగా చట్టాన్ని గౌరవిద్దాం.. ప్రాథమిక హక్కులను పొందుదామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించిందన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన పోలీస్ వ్యవస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తూ సమాజాభివృద్ధి, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఏవో, ఆర్ఎస్ఐలు అంజాత్ పాషా, డేవిడ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లా భరోసా సెంటర్‌లో..

వికారాబాద్ జిల్లా భరోసా సెంటర్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు మూడు ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు జిల్లా పోలీస్ కార్యాలయంలోని భరోసా సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెంటర్-కో-ఆర్డినేటర్(1), సపోర్ట్ పర్సన్(2) వీటి కాల వ్యవధి ఏడాది మాత్రమేనని.. బయోడేటా, ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లు, అడిగిన పత్రాలను dbusinesssolutionzz@ gmail.com ద్వారా లేదా వాట్సాప్ 8712670063 ద్వారా పంపాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి శీతల్

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి శీతల్

వికారాబాద్, నవంబర్ 26 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి శీతల్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని బూర్గుపల్లి సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో ఆమె విద్యార్థులతో కలిసి రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ 18 ఏండ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం ద్వారా వారు అనారోగ్యానికి గురవుతారన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడొద్దని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రామ, శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

పరిగి/కొడంగల్, నవంబర్ 26 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం పరిగిలోని బస్టాండ్ వద్ద,కొడంగల్‌లోని కడా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని పంటలకు మద్దతు ధరను పెంచాలన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పింఛన్ తోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్లను కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, సత్య య్య, మహిపాల్‌రెడ్డి, రఘురామ్, శేఖర్, ప్రశాంత్, మనోహర్, సాయిబాబు, అనిల్, ఆశ వర్కర్ల సంఘం తాలూకా అధ్యక్షురాలు పద్మావతి, సుజాత, రేణుక, యాదమ్మ, ఈశ్వరమ్మ, సుమిత్ర, సద్దాం హుస్సేన్, మొగులమ్మ, శ్రీనివాస్ రాథోడ్, వెంకటప్ప పాల్గొన్నారు.

కులకచర్లలో గిరిజన నాయకుల అరెస్టు

కులకచర్ల నుంచి లగచర్లకు వెళ్తారని అందిన సమాచారం మేరకు పలువురు గిరిజన నాయకులను కులకచర్ల పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేశారని గిరిజన నాయకులు గోవిం ద్‌నాయక్, రాజేందర్ తెలిపారు. లగచర్ల గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

-కులకచర్ల, నవంబర్ 26

మెట్రో ఫేజ్-2కు రూ.11,693 కోట్లు

- జనవరిలో ఓల్డ్ సిటీ మెట్రో కూల్చివేతలు
- రూ. 24వేల కోట్ల అంచనాతో రెండో దశ మెట్రో విస్తరణ
- వెల్లడించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): మెట్రో ఫేజ్-2 కోసం రూ. 11,693 కోట్ల రుణాలతో విస్తరించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే డీపీఆర్ పూర్తి కాగా... మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో 48శాతం మేర జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ(మల్టీ లెటరల్) వంటి ఆర్థిక సంస్థలను ఆశ్రయించనున్నది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 7313కోట్లు(30శాతం), కేంద్రం వాటా రూ. 4230కోట్లు(18శాతం), మల్టీ లెటరల్ సంస్థల నుంచి 48 శాతం అనగా రూ. 11,693 కోట్లను రుణాల రూపంలో నిధులు సేకరించనున్నది. ఈ అప్పులకు కేంద్రం గ్యారెంటీగా ఉండగా...మిగిలిన 4శాతం మేర రూ. 1033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చి ప్రాజెక్టును చేపడుతామని తెలిపారు. మొత్తం ప్రాజెక్టులో ఇదే కీలకమన్నారు. మెట్రో రైల్ ఫేజ్-1 నవంబర్ 28తో ఏడేళ్లు పూర్తి చేసుకోనుండగా... ఫేజ్-2 విస్తరణపై హెచ్ఎంఆర్ఎల్/హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. నగరంలో రెండో దశలో ఆరు కారిడార్లలో 116.4 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించనున్నట్లు తెలిపారు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్లు, మిగిలిన ఆరో కారిడార్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలను విడిగా రూపొందించినట్లుగా తెలిపారు. మిగిలిన 5 కారిడార్లకు రూపొందించిన డీపీఆర్‌కు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదంతో కేంద్రానికి అందించినట్లుగా స్పష్టం చేశారు.

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా మెట్రో విస్తరణ అత్యంత కీలకంగా మారిందన్నారు. తొలి దశలో అందుబాటులో ఉన్న మెట్రోతో నిత్యం 5.8లక్షల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. రెండో దశ మెట్రోతో 10లక్షల మంది ప్రయాణించే సౌకర్యం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ వరకు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు, నాగోల్ నుంచి రాయదుర్గ్ వరకు మొత్తంగా 69 కిలోమీటర్ల మూడు కారిడార్లలో మెట్రో మొదటి దశను రూ. 22148 కోట్లతో పీపీపీ విధానంలో చేపట్టినట్లుగా తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా మెట్రో విస్తరణ అత్యంత కీలకంగా మారిందనీ, దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో మెట్రో పరిధి పెరుగుతుందన్నారు.

మొదటి దశలో మూడు కోచ్‌లే...

రెండో దశలో అందుబాటులోకి వచ్చే మెట్రో రైలులో మూడు కోచ్‌లే ఉంటాయని స్పష్టం చేశారు. కానీ స్టేషన్లను మాత్రం ఆరు కోచ్‌లకు అనుగుణంగా నిర్మిస్తామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోచ్‌లను ఆరుకు పెంచనుంది. అయితే ఫేజ్-1లో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యాల పార్కింగ్, బస్ బే, ఆటో ఫీడర్ బేలతోపాటు గ్రౌండ్ లెవల్‌లో మరింత స్థల సేకరణపై దృష్టి పెడతామన్నారు. ఎంఎంటీఎస్, ఆర్టీసీ, స్వీడా, ర్యాపిడో వంటి పలు రకాల రవాణా మార్గాలతో అనుసంధానం చేస్తామన్నారు. సిగ్నలింగ్, ఓహెచ్ఈ, కలెక్షన్, రోలింగ్ స్టాక్ వంటి వాటిలో ఆధునాతన సాంకేతికను వినియోగిస్తామని స్పష్టం చేశారు.

జనవరి ఫస్ట్ వీక్‌లో షురూ..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న 7 కిలోమీటర్ల మేర ఓల్డ్ సిటీ మెట్రో పనులు డిసెంబర్ నెలాఖరు నుంచి వేగంగా జరుగుతాయన్నారు. జనవరి మొదటి వారంలో కూల్చివేతలతోపాటు, పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఇప్పటికే మెట్రో వల్ల రోడ్డు విస్తరణ ప్రభావితం అవుతున్న వారసత్వ, మతపరమైన కట్టడాలకు నష్టం లేకుండా ప్రాజెక్టును చేపడుతున్నట్లుగా తెలిపారు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా మొత్తం హెచ్ఏఎంఎల్ చేపడుతుందన్నారు.

రుణాలతో రెండో దశ...

రెండో దశ విస్తరణ కోసం హెచ్ఎంఆర్ఎల్ భారీ స్థాయిలో రుణాలను సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయంలో కేంద్ర, రాష్ట్ర వాటాలు పోను మిగిలిన మొత్తాన్ని జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటి సంస్థల నుంచి సేకరించనుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్త పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ముందు వరుసలో ఉండటంతో... పలు ఫైనాన్షియల్ సంస్థలు ముందుకు వస్తున్నాయని, వేల కోట్ల రూపాయలు దేశంలోని మెట్రో నగరాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో 2శాతం వార్షిక వడ్డీతో రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. దీనికి ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలు కూడా వర్తించవనీ, కేంద్ర పూచీకత్తుతో నిధుల సేకరణ సులభతరం అవుతుందన్నారు. మల్టీ లిటరెల్ సంస్థల ద్వారా రూ. 11,693 కోట్లు సేకరిస్తామన్నారు. మొదటి దశ మెట్రో వడ్డీ భారం కంటే వార్షికంగా 7శాతం మేర తగ్గుతుందన్నారు.

నార్త్ సిటీలో ఇప్పట్లో లేనట్లే...

రెండో దశలో నార్త్ సిటీకి మెట్రో విస్తరణపై భారీ స్థాయిలో చర్చ జరుగుతుంది. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో నార్త్ సిటీలో ఉన్న ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు మెట్రో నిర్మాణంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. కానీ రెండో దశలో సాధ్యం కాదనీ, రైట్ ఆఫ్ వే, భూ సేకరణ, రక్షణ శాఖ భూముల సమీకరణ వంటి అంశాలు ఈ ప్రాజెక్టుకు ఆటంకం కలిగిస్తాయన్నారు. అయితే ఈ మార్గంలో ప్రతిపాదిత హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుతో హెచ్ఎంఆర్ఎల్ సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. డబుల్ డెక్కర్ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నా... రెండో దశలో సాధ్యం కాదన్నారు.